# సుడిగాలి

"శ్రీమతి గారండీ ! మన బుజ్జిగాడు నిద్రలేచి మంద్ర స్వరమందుకున్నాడండోయ్" పడగ్గదిలోంచి శ్రీవారి గొంతు టీవీ సీరియల్ డైలాగులా వినబడింది ప్రతిభకు.

"ఊ... ప్రకాశ్ ఎప్పుడూ ఏదో సీరియల్ చూస్తుంటాడు" గొణుక్కుంది. వంట పనిలో సతమతమవుతూ కిటికిలోంచి బయటికి దృష్టి సారించింది. తూరుపు ఆకాశం అరుణవర్ణమవుతోంది. మబ్బుకన్యలు ముసుగులు సవరిస్తూ మాయమవుతున్నారు. అప్పుడే తెల్లవారి పోయిందే.

అప్పుడెప్పుడో పేపర్‌బాయ్ పిలుపుకు స్పందించాలన్పించలేదు. కాని పాలవాడి అరుపుకు మంచం దిగక తప్పలేదు. "సంసార సాగరం ఇంత లోతుంటుందని ఎప్పుడన్నా ఊహించానా..." తనలో తానే నసుగుతూ పాలు పట్టింది. ఆ తర్వాత ఒంటిపని, ఇంటిపని... ఒకదాని వెనక ఒకటి టీ.వీ. యాడ్స్‌లా రోజువారీ పనుల్లో కూరుకుపోయింది. చిరాకులు, పరాకులు పంజెయ్యవని తెలిసి రాజీపడి పోయింది. నల్లని డికాక్షన్‌లో తెల్లని పాలు కలుపుతూంటే... మరోసారి ప్రకాశ్ పిలుపు... ముందట్లాగే వినబడింది.

"ఛీఛీ... పొద్దట్నుంచి అర్ధరాత్రి దాకా అవే సీరియల్స్, లేడీ విలన్ల మూస కథలు" మనసులో గొణుక్కుని "అబ్బా ! ఆ టీ.వీ. ఆపెయ్యరాదా !" గొంతెత్తి మందలింపు విసిరింది.

ఏమనాలో అర్థం కాలేదు ప్రకాశ్‌కు. లేచి మంచం చివరికొస్తూంటే ఆవలింత తోసుకొచ్చింది. చిన్నారి రోహిత్ ఒడిలో కొచ్చేశాడు. పుత్రానందం పురివిప్పింది.

"ఇంకా టీ.వీ. ఆన్ చెయ్యలేదు ప్రతిభా ! మన వంశోద్ధారకుడు పిలుస్తున్నాడంటున్నా" గట్టిగా అనేశాడు. ఆ లోగానే వంశోద్ధారకుని మలవిసర్జన లుంగీమీద పడింది.

"అయ్యో !... ముందు నువ్విట్రా ప్రతిభా !" కొంపలంటుకుపోతున్నట్టు కేకేశాడు. ప్రతిభకు అరికాలు మంటనెత్తికెక్కింది.

"ఏంటటా అంత అర్జంటూ?" పరుగులాంటి నడకతో వచ్చేసింది. ప్రకాశ్ ముఖకవళికలు, రోహిత్ చెంగలింపు... నవ్వాలన్పించింది "ఆ మాత్రానికే అంత లొల్లి ఎందుకటా ? ఇప్పుడు వాని మలమూత్రాదులు భరిస్తేనేగదా రేపు మనం కుక్కిలో పడ్డాక వాడు భరించేదీ !" నవ్వాపుకుంటూ రోహిత్‌నందుకుని బాత్రూంలో కెళ్ళింది.

బయటికొచ్చి "ఇప్పుడు తీసుకొండి...." భర్త కందించబోయింది.

పెళ్ళాన్నోసారి కింది నుంచి మీద్దాకా పరిశీలించాడు. గుండెల్లో ఏవో గుసగుసలు...

"నేనివ్వాళ్ళ క్యాంపుకెళ్ళాలోయ్ !" ఇప్పుడేమన్నా లాభం లేదనుకున్నాడు. "నేరుగా ఆఫీసుకెళ్ళి ఫైళ్ళు తీసుకొని అట్నుంచటే వెళ్తా" లుంగీ మడిచేసి వెనక నుంచెవరో తరుముతున్నట్టు టాయ్‌లెట్లో చొరబడ్డాడు.

"అమ్మా ...!" రోహిత్ అష్టమ స్వరమందుకున్నాడు. పొద్దున్నే పాలుపడితే కాస్సేపు బొమ్మల్తో ఆడుకుంటాడు. ఆ తర్వాత ఆఫీసుకెళ్ళేదాకా ప్రకాశ్ ఆడిస్తాడు, కాని... ఇప్పుడెట్లా ...

"అబ్బా ! కాస్సేపాగురా !" ఎత్తుకుని వీపు నిమురుతూ వంటింట్లోకెళ్ళింది. గ్యాస్ పొయ్యిమీది పాలు పొంగిపొర్లి మంట చల్లారిపోయింది. బుర్రలో సుర్రుమంది. బాబు నొక్కటంటించింది. కెవ్వుమన్నాడు.

"అరెరే ఏమైందీ !" ఆదరాబాదరగా వచ్చాడు ప్రకాశ్. ఆవేశాన్నదిమి పెట్టి కళ్ళతో పొయ్యి చూపించింది.

"అరెరే !" గ్యాసు ఆఫ్ చేశాడు. మిగిలిన పాలు వీనికీ పూటకే సరిపోవు.

"ఓ పాకెట్ కొనుకొస్తాలే .."

అటు ప్రకాశ్ బజారుకెల్తుంటే ఇటు రోహిత్ రోదన రెట్టింపైంది. పిచ్చెక్కినట్లైంది ప్రతిభకు. మిగిలిన పాలు సీసాలో పోసి నోటి కందించింది. ఎన్నాళ్ళ నుంచో పాలకోసం పరితపిస్తున్నట్టు ఆబగా లాగించేస్తున్న పసివాణ్ని చూసి "అయ్యో పాపం !" అనుకుంది.

"ప్రతిభా ! వంట త్వరగా కానీ" పాలపాకెట్ చేతికిస్తూ ప్రకాశ్ "ఇంకో గంటలో ఆఫీసులో ఉండకపోతే మా బాస్ శివతాండవ మాడ్తాడు. రిజర్వేషన్ చేయించుకున్న ట్రెయిన్ మిస్సైపోతుంది ..." బాత్రూంలో కెళ్ళబోయాడు.

"ముందీ చాయ్ కానీ" ఓ చేత్తో కొంగు సవరించుకుంటూ మరో చేత్తో చాయ గ్లాసందించింది.

రోహిత్ బొమ్మరైలుతో ఆడుకుంటున్నాడు. ప్రకాశ్ నిశిత దృక్కులు కింది నుంచి మీద్దాకా తడుముతున్నాయి. చాయోత్సాహం గిలిగింతలు పెట్టింది.

"వాహ్ ! నీ అందం ఆరు రెట్లైందోయ్" ఎడమచేత్తో భుజమందుకోబోయాడు.

"బాగానే ఉంది సంబడం !" ముంగురులు సవరించుకుంటూ అడ్డుకుంది. తానూ చాయగ్లాసందుకుంది.

"హబ్బా ! నీ అందాన్నాస్వాదించాలను కున్నానోయ్ !" నున్నని బుగ్గమీద సన్నని చిటికెపడింది. ఇష్టమైనా ఆ సమయంలో కష్టమన్పించింది. సిగ్గుల్ని అదిమి పెడుతూ.

"ఛఛా... సిగ్గులేదూ ! ముందు చాయ ఆస్వాదించు" పక్కకు జరిగింది. "ఇంటెడు చాకిరీ ఒక్కదాన్నే చేసుకోవాలి" మూతులు తిప్పి చాయగ్లాసును గోలీషోడా సీసాలా ఖాళీ చేసింది.

స్నానం చెయ్యకుండా వంట చెయ్యాలంటే మనసొప్పలేదు. ప్రకాశ్ బాత్రూం లోంచి బయటికొచ్చే సరికి కూరగాయలు తరిగిపెట్టుకుంది. తానూ స్నానం ముగించు కుంది. వెంటనే పూజ గుర్తుకొచ్చింది.

ప్రకాశ్ పంజేస్తుంది ప్రైవేట్ కంపెనీలో. తక్కువ జీతం, ఎక్కువపని. ముందు వంటచేసి భోజనం వడ్డించాలి. పూజా పునస్కారం తర్వాత... సర్దుబాటు సంతృప్తి నిచ్చింది. గోళ్ళతో జుట్టు సవరించుకుని కుంకుమ బొట్టు నుదుటి కద్దుకుని వంటింట్లో ప్రవేశించింది.

ప్రకాశ్ రోజూ టిఫిన్ చేసి, లంచవర్లో ఇంటి కొస్తాడు. ఈ రోజలా కుదరదు. ఇప్పుడతనికి అన్నం, తనకు టిఫిన్, మధ్యాహ్నం తన ఒంటి ప్రాణానికి అన్నం... వంటింటి కుందేలవక తప్పదు. విసుగొచ్చినా లాభం లేదు. రోజూ సాయంత్రం ట్యూషన్లు చెప్పాలి. బజారుకెళ్ళి కూరగాయలు తెచ్చుకోవాలి. అలసివచ్చిన ప్రకాశ్‌కు చాయ అందించాలి... ఆ తర్వాత రాత్రి వంట... రోహిత్‌కు తినిపించాలి... ఇవన్నీ ఆడదానికి వరాలో, శాపాలో !

ఎన్నడన్నా సినిమాకెళ్తే అట్నుంచటే హోటల్ కెళ్ళి భోంచేసి రావల్సిందే. మధ్య తరగతి మనుషులు పరువుగా బతకడమే గొప్ప. ఈ గంగిరెద్దు బతుకుల్లో సుఖశాంతులు ఎండమావులే.

ఆనాడు, స్వేచ్ఛా విహంగములాగున్న రోజుల్లో భవిష్యత్తు గురించి తానూహించిందేమిటీ, ఇప్పుడు జరుగుతుందేమిటీ ?

❋ ❋ ❋

వేరుగా ఉండడమంటే నేరుగా స్వర్గసుఖాల నందుకోవడమే. అత్తామామల అదుపాజ్ఞలు, తోటికోడళ్ళ సతాయింపులు, భరించలేక పెళ్ళైన యువతులెందరో ఆత్మహత్యల నాశ్రయిస్తున్నారు. కన్నవారిని, ఉన్న ఊరిని వదిలి మెట్టింట్లో అడుగుపెట్టిన నవ వధువుల్ని కట్నం కోసం కాల్చుకుతింటున్నారు. మూడుముళ్ళ జీవితం ముచ్చటగా సాగాలంటే విడిగా ఉండటమే అందరికీ హాయి ...

అంతర్ కళాశాలల ఉపన్యాస పోటీల్లో శ్రోతల నదరగొట్టి బహుమతులందుకున్న

ప్రతిభ వుమెన్స్ కాలేజి విద్యార్థిని. తన ప్రతిభా పాటవాలకు దాసోహమన్న ప్రకాశ్ ఓ మధ్యతరగతి చిరుద్యోగి అని తెలిసినా ప్రేమపాశంతో మూడుముళ్ళు వేయించుకుంది.

కొత్తకోడలుగా కొంతకాలం, సీమంతోత్సవం, తొలి చూలాలుగా మరికొంత కాలం అత్తారింట్లో అందరి సేవలందుకుంది. మహిళకు మాధవుడిచ్చిన వరం మాతృత్వం.. అదో దివ్యానుభూతి. బాబు నామకరణోత్సవం... బంధువుల నవ్వుల జల్లు కురిపించింది. బాలింతగా ఇంకొంత కాలం గడిచింది. ఇంటిపనులు అత్తయ్య, వంటపనులు అక్కయ్య (తోటి కోడలు) చేసేవారు.

జలుబుచేసినా, తలనొప్పి వచ్చినా అత్తయ్య చిట్కావైద్యం అమృతప్రాయంగా పంజేసింది.

"మా ప్రతిభ... నాకు తోడబుట్టిన చెల్లిలాగుంది." అక్కయ్య మురిపాలు, "మావాడు ప్రేమించి పెళ్ళాడినా నా చిన్నకోడలు ఇంటి పరువు నిలబెట్టోంది" అత్తయ్య హర్షం అలరింపజేసినై. రోహిత్‌కు చిన్నపాటి సుస్తి చేసినా,

"పద ప్రతిభా ! పిల్లల డాక్టర్ దగ్గరికెల్దాం" అంటూ అక్కయ్య తీసుకెళ్ళేది. అప్పుడు గూడా ప్రకాశ్ క్యాంపులు మామూలే.

వుమెన్స్ కాలేజీలో మాజీ విద్యార్థినుల సంఘం ఏర్పాటైంది. తనలాంటి వారెందరో సమావేశమై తియ్యని జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఆనాడు కలిసి తిరిగిన స్నేహితురాళ్ళు తన ఉపన్యాసాలను గుర్తు చేశారు.

"గుమ్మడికాయలాంటి ఉమ్మడి కుటుంబంలో ఉన్నావట గదా !"

"కలిసి ఉండి సుఖాలననుభవిస్తున్నావా !"

"చెప్పడాన్కి చెయ్యడాన్కి చెప్పరాని దూరము గదా !"

బుగ్గలు పుణుకుతూ, జడలాగుతూ ఎద్దేవా చేశారు. ఆ మాటలన్నీ ముళ్ళై గండెలకు గుచ్చుకున్నాయి.

"నేనైతే పెళ్ళవగానే వేరే కాపురం పెట్టించాను" శాంభవి గర్వంగా చెప్పింది.

"అత్తారింట్లో అందరూ ఉమ్మడి కుటుంబంలో సెటిలయ్యే దాకా సేవలందించి ఆ తర్వాత ఊడిగం చేయించుకుంటారు" సంసార జీవితములో సీనియర్ విద్యార్థిని కమల క్యాజువల్‌గా చెప్పేసింది. ఆవిడ బావగారు అపర కీచకుడని చెవిలో చెప్పింది.

ఇద్దరు ముగ్గురు ఉమ్మడికుటుంబమే ఉత్తమమని వారి అనుభవాలను ఏకరువు పెట్టినా వాటి నెవ్వరూ పట్టించుకోలేదు. కలిసి ఉన్న కుటుంబాల్లో ప్రైవసీ కరువని, పగలు భర్తతో ఏకాంతంగా గడిపే అవకాశం తక్కువన్నారు.

ఆనాటి తన ఉపన్యాసాంశాలు "ఇంటిలోని పోరు ఇంతింత గాదయా అన్నారు. పరువు ప్రతిష్ఠలంటూ కలిసి కష్టాల కడలి ఈదే బదులు విడిగా ఉండి కలివిడిగా బతకడమే మేలు..." విద్యార్థినీ లోకాన్ని ఉగ్రూత లూగించిన విషయం బుర్రలో గిర్రుమంది.

దృఢనిర్ణయంతో ఊపిరి పీలుస్తూ ఇంటికొచ్చింది. రోహిత్ నేలమీద కూలబడి గుక్కపట్టి ఏడుస్తున్నాడు. అరికాలును ఎర్రతేలు కుట్టినట్టయింది. రోషం రుసరుసలాడింది.

"నేను బజారులో బలాదూర్ తిరుగుతున్నానుకుంటున్నారేమో ! "వాడంతగా ఏడుస్తుంటే వినబడలేదా అత్తయ్యా ! అక్కయ్యేదీ ? వానికిన్ని పాలుపడితే అరిగి పోతుందా ?" తనకు తెలీకుండానే మాటలు తూటాల్లా దూసుకొచ్చినై.

"ఇదిగోనమ్మా, పాలు వేడిచేసి చల్లార్చి పట్టుకొస్తున్నా" అత్తయ్య పాలసీసాతో బయటికొచ్చింది.

"వాడిప్పుడే నిద్ర లేస్తాడనుకోలేదు ప్రతిభా" తోటికోడలు అంతఃపురకన్యలా అడుగువేస్తూ వచ్చింది.

"పైగా సమర్థించుకోవడం గూడానా !" ముక్కెపుటాలెగిరి పడుతూంటే పాలసీసా లాక్కుంది. వాళ్ళిద్దరూ బిత్తరబోయి మొహాలు చూసుకున్నారు. రాత్రి పడగ్గదిలో ప్రకాశ్‌కంతా చెప్పింది.

"ఏదోలే ... వడ్లగింజలో బియ్యపు గింజ" కొట్టిపారేశాడు.

ఇన్ని రోజులు వాళ్ళను గుడ్డిగా నమ్మడం పొరపాటైంది. మర్నాడు శనివారం... సాయంత్రం... అలసిన ప్రకాశ్ ఉసూరుమంటూ వచ్చి కుర్చీలో కూలబడ్డాడు. ముసిముసి నవ్వుతో చాయ అందించింది.

"ప్రతిభా ! నీ కోసం ఏం తెచ్చానో చెప్పుకో" అన్నాడు చాయ్ చప్పరిస్తూ.

"నా కోసమైతే... మల్లె దండ..." రోహిత్‌కు పౌడర్ అద్దుతున్న కళ్ళల్లో వింతకాంతి.

"పోనీ ... మన కోసం ...."

"మల్లెదండతో పాటు మల్లెపూలు..."

"కాదు ... మల్లీశ్వరి సినిమా టికెట్లు. త్వరగా వెళ్ళాలి."

మళ్ళీ మళ్ళీ చూడాలన్పించే మల్లీశ్వరి సినిమా.

మనోవిహంగము ఖుషీగా రెక్కలు విప్పింది.

పది నిముషాల్లో తయారై ఫస్ట్‌షోకెళ్లారు.

తిరిగొచ్చాక భోంచేద్దామనే సరికి ఖాళీ వంట పాత్రలు వెక్కిరించినై. అత్తా

మామలు, అక్కయ్య కన్పించలేదు. వారిమట్టుకే వండుకుని తినేసుంటారు. బావగారు ఊళ్ళోలేరని తెలుసు. ఉక్రోషం, ఉన్మాదం ఆటుపోట్ల మధ్య తోటికోడలు తోడేలులా గన్పించింది.

"అక్కయ్యా !" గది ముందుకెళ్ళి తలుపు తట్టింది. గొంతులో ఆవేశం

"హాఁ... ప్రతిభా ! రామ్మా !" బావిలోంచి వచ్చినంట్టుందా గొంతు. సర్రున లోపలికెళ్ళింది.

"తలనొప్పి సతాయిస్తుందమ్మా !" లేచి కూచుంది. "అత్తామామలు గుడికెళ్ళారు. వ్వ... వంట గూడా చెయ్యలేక పోయానమ్మా!" మూల్గుతోంది. తల పట్టుకుంది.

హబ్బో ! నంగనాచి, తుంగబుర్ర. అంతా నటనే... అత్తా మామ లొచ్చారపుడే "గుళ్ళో హరికథ వింటూ ఉండిపోయాం" అత్తయ్య మాటలు ఆరితేరిన సన్నాయి నొక్కుల్లాగన్పించినై. అప్పటికప్పుడు రంగంలోకి దిగి తానే అందరికి వంట చేయాల్సి వచ్చింది.

స్నేహితురాళ్లు చుట్టూచేరి "అయ్యో పాపం ! ప్రతిభ. ప్రతిభా పాటవాలన్నీ వంటింట్లో తంటాలు పడుతున్నై" వెక్కిరిస్తున్నట్టనిపించింది.

తలకొట్టేసి చిలకొయ్యకు వెళ్ళాడదీసినట్లైంది. మూడు రోజులలాగే గడిచినై. నాల్గోరోజు రాత్రి ... రోహిత్‌ను నిద్రబుచ్చి ప్రకాశ్ తలను తనవైపు తిప్పుకుంది.

"అడుగడునా మన కన్యాయం జరిగిపోతుంది గదా !" ప్రస్తావించింది.

"అట్లానా ?" బుగ్గగిల్లాడు. జీరో బల్బు నవ్వుతోంది. చెయ్యిలాగి పారేసి ఎన్నో చరిత్రలు ఏకరువు పెట్టి "ఈ అనుమానాలు, సతాయింపులు ఇంకెన్ని రోజులు భరించాలి?" ప్రశ్నాబాణం సంధించి పక్కకు జరిగి పడుకుంది.

ప్రకాశ్ మెదడునేదో పురుగు తొలిచేసినట్టుంది. ఉదయమే తల్లిదండ్రులతో వాదించి "మనుషులు దూరముండి మనసులు దగ్గరుండడం మంచిది కదా !" అన్నాడు అర్థవంతంగా. తన అంతరంగాన్ని అవలీలగా అర్థం చేసుకున్న పెద్దవాళ్ళు సరేనన్నారు. నిర్ణయం అమలై ఆర్నెల్లు దాటింది.

గత నెల చివరలో ప్రకాశ్ కాంపుకెళ్ళాడు. రోహిత్‌కు రొంప, జ్వరం... కలవరింత. తన వెన్నుపూస లోంచి సన్నని వణుకు పుట్టుకొచ్చింది. "చదువుకున్న మహిళవు గదా !" ఏదో శక్తి హెచ్చరించింది.

ధైర్యంగా ఆటోలో ప్రభుత్వాసుపత్రికెళ్ళింది. చాంతాడంత క్యూ... పక్కనుంచి ముందుకెళ్లబోయింది.

"మేమంతా మనుషులం కాదూ !" ముందున్న వాళ్ళు వెనక్కు నెట్టేశారు. భుజమ్మీద రోహిత్ మూల్గుతున్నాడు. ఓపిగ్గా డాక్టర్ ముందుకెళ్ళాక రెండు మాత్రలిచ్చి వెళ్ళిపొమ్మన్నాడు.

"అబ్బో ! లాభం లేదు..." గొణుక్కుని నర్సింగ్ హోం తీసుకెళ్ళింది. అప్పటికే ఫిట్స్ ప్రారంభమైపోయినై.

"ముందక్కడ వెయ్యిరూపాయలు డిపాజిట్ చెయ్యాలి" జూనియర్ డాక్టర్ చూపించాడు. ఘాట్‌రోడ్‌పై నడుస్తూ లోయలో పడిపోతున్నట్టుంది.

పబ్లిక్ ఫోన్ నుండి మావయ్యకు ఫోన్ చెయ్యడం, ఆయన ఆఘమేఘాల మీద వచ్చి డబ్బు కట్టెయ్యడం, చకచకా జరిగిపోయినై. అక్కయ్య ముప్పూటలా క్యారేజి తెచ్చింది డిస్చార్జయ్యే దాకా అత్తయ్య వెంట ఉంది. ప్రకాశ్ వచ్చింతర్వాత అంతా విని "విడిపోతే సుఖపడి పోతామనుకున్నాం గదా ! సొంతిల్లు వదిలి అద్దింటి కొచ్చాం గదా !" నిట్టూర్చాడు. అందులోని ఆంతర్యం తనకర్థం కాలేదు.

"ప్రతిభమ్మా ...!" పరుగుల ఆలోచనలకు ఇంటి ఓనరు పిలుపు పగ్గం వేసింది. కొంగు సర్దుకుంటూ కళ్ళద్దుకుంది.

"కూచోండి బాబాయ్ !"

"తీరిగ్గా కూచోలేనమ్మా. నెలాఖరు రోజులు గదా ! ఇంటి కిరాయి ఠంచన్‌గా ఫస్టునాడివ్వాలని గుర్తుచేద్దామని వచ్చానంతే" సుడిగాలిలా వెళ్ళిపోయాడు.

మూన్నెళ్ళ అడ్వాన్సడిగితే ఒకే నెలదిస్తిమి. పదోతారీకు లోగా కిరాయి ఇవ్వడం కుదరడం లేదు. ప్రకాశ్ జీతం సాధారణ ఖర్చులకే సరిపోతుంది. ఇంటి కిరాయి కోసం ట్యూషన్లు చెప్పాల్సి వచ్చింది. అదనపు ఖర్చులంటే అయోమయం... మధ్య తరగతి మందహాసం వెనక ఇంత కథ ఉందన్నమాట. వచ్చేది పండగల సీజన్... వచ్చే సంవత్సరం రోహిత్‌ను బడిలో చేర్పించాలి. విద్యావ్యాపారం పరిఢవిల్లుతున్న ఈ రోజుల్లో పిల్లాడిని బడిలో చేర్పించడమంటే పెళ్ళిఖర్చుల కేర్పాట్లు చేసుకోవడమే... కొంగు బొడ్లో దోపుకుని కుర్చీలో కూచోబోతుంది.

ఇంటిముందు ఆటో ఆగింది. ప్రకాశ్ తూలుతూ, మూల్గుతూ లోపలికొచ్చాడు. భుజాల మీద చేతులేసి మంచమ్మీద పడుకోబెట్టింది... "ఏమైందీ ?" గాబరా.

"క్యాంపుకు బయలుదేరబోతుంటే చలిజ్వరమందుకుంది. ఆఁ... ఊఁ..."

"ఇప్పుడెట్లా... !" నిలువెల్లా భయం.

"ఆస్పత్రి కెల్దాం. అన్నయ్యకు ఫోన్ చెయ్..."

ఫోన్ చెయ్యగానే పరుగెత్తుకొచ్చాడు పవన్‌కుమార్.

"ఏమైందమ్మా ... ఏమైందిరా ?" ఇద్దర్నీ అడిగాడు.

"ఏమో అన్నయ్యా ! జ్వరమొచ్చి ఆఫీసులోనే కూలబడ్డ."

"అర్జంట్‌గా డాక్టర్ వద్ద కెళ్ళాలి" అంటూ వెళ్ళి ఆటోతో వచ్చాడు.

రక్తపరీక్ష, మూత్ర పరీక్ష, ఎక్స్‌రే ... బెడ్ చార్జీలు... నర్సింగ్ హోంలో నాల్గు రోజులు... ఖర్చు తడిసి మోపెడైంది. పవన్‌కుమార్ పర్సు ఖాళీ అయింది. రోజూ తోటి కోడలు క్యారేజి తెచ్చింది. అత్తయ్య వెంట ఉండి ధైర్యం నూరి పోసింది.

"వారం రోజులు పూర్తి రెస్టు తప్పనిసరి" డాక్టర్ సలహా. పవన్‌కుమార్ ఆటో తీసుకొచ్చాడు.

"నేరుగా మనింటికెల్దాం మావయ్యా" ప్రతిభ చూపులు అత్తయ్య మీద కేంద్రీకృత మైనాయి. తడైన కళ్లు 'పొరపాటైంది' అంటున్నాయి.

"ఇహ వేరుగా ఉండలేము మావయ్యా !" చేతులు జోడించింది.

***(జాగృతి, 30-1-2006)***

